ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లావ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి బి.ప్రభాకరరావు తెలిపారు. 29 కేంద్రాల్లో సాధారణ ప్రాక్టికల్స్, 16 కేంద్రాల్లో వృత్తి విద్య ప్రాక్టికల్స్ జరిగాయని చెప్పారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌లో 1,114 మందికి 1,096 మంది హాజరవ్వగా 18 మంది గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం నుంచి జరిగిన పరీక్షల్లో 1,839 మందికి 1,772 మంది హాజరవ్వగా 67 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం నుంచి ఒకేషనల్ మూడో స్పెల్, జనరల్ రెండో స్పెల్ ప్రారంభమవుతాయని ఆయన చెప్పారు.

నేడు బంద్, సమ్మెకు సర్వం సన్నద్ధం

జిల్లా, మండల కేంద్రాల్లో ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు - నేతృత్వం వహించనున్న రైతు, కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దేశవ్యాప్తంగా 11 జాతీయ కార్మిక సంఘాలు, 550 రైతు సంఘాలు ప్రాతినిధ్యం వహిస్తున్న కిసాన్ సంయుక్త మోర్చా ఫిబ్రవరి 16న జాతీయ సమ్మె, గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో శుక్రవారం ర్యాలీలు, సభలు జరగనున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్.స్వామినాథన్‌కు 'భారతరత్న' పురస్కారం ప్రకటించింది. అయితే ఆయన ప్రతిపాదించిన కనీస మద్దతు ధరను గత ప్రభుత్వాలు, నేటి బిజెపి ప్రభుత్వం పూర్తిగా తిరస్కరించాయి. డాక్టర్ స్వామినాథన్ రైతాంగానికి మేలు చేసే విధానాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి ప్రకటించారు. మద్దతు ధర అంటే రైతు పంటను పండించేదానికి అయ్యే ఖర్చు, రైతు కుటుంబం చేసే శ్రమకు అదనంగా 50 శాతం జోడించాలని వివరించారు. ఇది అమలు కానందునే వ్యవసాయం నేడు దివాలా తీసింది. నేటికీ మన దేశంలో ప్రజలు 65 శాతం వ్యవసాయంపైనే ఉపాధికి ఆధారపడి ఉన్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఈ శాతం మరింత ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు వ్యవసాయాన్ని వదిలి పొట్ట కూటి కోసం వివిధ ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వ్యవసాయంపై ఆధారపడిన కూలీ, కౌలు రైతు, చిన్న, మధ్యతరగతి రైతులకు ప్రభుత్వం ఎటువంటి సహాయాన్నీ అందించడం లేదు. స్వాతంత్ర్యానంతరం ఎన్నడూ జరగనంతగా 2021-22లో మూడు రైతు నల్లచట్టాలకు వ్యతిరేకంగా లక్షలాది మంది రైతాంగం మహా ఉద్యమం నడిపింది. ఆ సందర్భంగా ఆ చట్టాలను వెనక్కి తీసుకుంటున్నామని, రైతులకు మద్దతుధరల గ్యారెంటీ చట్టం తీసుకొస్తామని, రైతులపై కేసులు ఎత్తివేస్తామని చేసిన వాగ్దానాలు నేటికీ అమలు కాలేదు. రైతులపై 45 వేల పోలీసు కేసులున్నాయి. 742 మంది ఈ ఉద్యమంలో మరణించారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలేవీ అమలుకు నోచుకోలేదు.

కార్మిక వర్గం స్వాతంత్య్రం ముందు నుండి సాధించుకున్న కార్మిక హక్కులపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోంది. అందుకే ముందుగా కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చింది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా 16న తలపెట్టిన జాతీయ పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌కు జిల్లాలోని కార్మికులు, రైతులు సిద్ధమయ్యారు. అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో నిరసనలు తెలిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు.

అభివాదం చేస్తున్న రైతు, కార్మిక నేతలు (ఫైల్‌ఫోటో)

రైతాంగానికి తోడుగా కార్మిక వర్గం

డివిఎన్‌విడి.ప్రసాద్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

ఇటీవలే మన రాష్ట్రంలో అంగన్‌వాడీ మహిళలు నిర్బంధాలను లెక్క చేయకుండా పోరాడి తమ కోర్కెలు సాధించుకోవడం చూశాం. అనేక సందర్భాల్లో రైతాంగానికి కార్మికవర్గం, కార్మిక వర్గానికి రైతాంగమూ తోడుగా నిలబడింది. ఈ అనుభవాలతో గ్రామీణ ప్రజానీకాన్ని, కార్మిక వర్గాన్ని చైతన్యపరిచి పోరాటం సాగించాల్సి ఉంది. ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతున్నాం. ఇప్పటికే జిల్లాలోని 27 మండలాల్లో కార్మిక చట్టాల సవరణ, ప్రయివేటీకరణ, పరిశ్రమల మూసివేతకు నిరసనగా పెద్దఎత్తున ప్రదర్శనలు చేపట్టబోతున్నాం. ఏలూరులో సుమారు ఐదు వేల మంది కార్మికులు ఉన్న జ్యూట్‌మిల్లు ఇప్పటికే మూతపడింది. కొత్తూరు జ్యూట్‌మిల్లు కూడా మూసివేతకు సిద్ధంగా ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే దీనికి కారణం. కాబట్టి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఈ బంద్‌లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని తమ నిరసన తెలపాలి.

కేంద్రం విధానాలతో రైతులు సతమతం

కె.శ్రీనివాస్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి

కేంద్ర ప్రభుత్వ విధానాలతో జిల్లాలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పోలవరం నిర్మాణానికి నిధులు లేవు. గిరిజనులకు పరిహారం ఇవ్వడం లేదు. పునరావాసంపై ఈ ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయి. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామన్న హామీలు ఇప్పటి వరకూ నెరవేరలేదు. పైగా కొల్లేరును ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటిస్తూ తీసుకున్న నిర్ణయం వల్ల, ప్రభుత్వాలు పెట్టే అనేక ఆంక్షలు వల్ల కొల్లేరు ప్రజల జీవనోపాధి దెబ్బతిని అనేక ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడం, దిగుమతి సుంకం తగ్గించడంతో, ఏటా రూ.70 వేల కోట్ల వంట నూనె దిగుమతి చేసుకోవడంతో జిల్లాలో లక్షల ఎకరాల్లో పండిస్తున్న ఆయిల్‌పామ్ రైతులు ఆదాయం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా జరిగే గ్రామీణ బంద్ జయప్రదానికి ఇప్పటికే కరపత్రాలు పంచటం, సభలు సదస్సులు సమావేశాలు నిర్వహించాం. జిల్లాలోని అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో ర్యాలీలు, రాస్తారోకోలు, ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో నిరసనలు చేపట్టబోతున్నాం. కార్మికులు, రైతులు ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొనాలని కోరుతున్నాం.

మెరుపు సమ్మెకూ వెనుకాడబోము

ఆర్థిక బకాయిల విడుదల కోరుతూ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిల సాధనకు అవసరమైతే మెరుపు సమ్మెకూ వెనుకాడబోమని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జెఎసి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆర్థిక బకాయిల కోసం చేపట్టిన దశలవారీ ఆందోళనలో భాగంగా గురువారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో జెఎసి ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలుగా ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల పట్ల అవలంబిస్తున్న తీరుపై తాము అనేకసార్లు మంత్రివర్గ ఉపసంఘం, జాయింట్ స్టాఫ్‌కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించి నిరసన తెలిపామని గుర్తు చేశారు. అనేక సమస్యలతో ఉద్యోగులు ఉన్నప్పటికీ ప్రభుత్వానికి సహకరిస్తూనే వచ్చామని తెలిపారు. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే ఉద్యోగులు ఆందోళన బాట పట్టారని, శుక్రవారం కూడా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 20న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా, 27న చలో విజయవాడ కార్యక్రమం లక్షలాదిమంది ఉద్యోగులతో చేపట్టనున్నామని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే మెరుపు సమ్మెకూ వెనుకాడబోమని హెచ్చరించారు. జెఎసి రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఆర్ఎస్.హరినాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జెఎసి కన్వీనర్ రామారావు, వివిధ సంఘాల నాయకులు ఆర్.రవికుమార్, పివి.నరసింహారావు, శ్రీధర్‌రాజు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

20 లోపు సమస్యలు పరిష్కరించుకుంటే పోరాటం

మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నేతలు, మున్సిపల్ కార్మికులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమ్మె ముగిసి 35 రోజులు గడుస్తుందన్నారు. సమ్మె వాయిదా సందర్భంగా ప్రభుత్వం షరతులు లేకుండా సమ్మెకాల జీతం చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. మినిట్స్ కాపీలో, జిఒ ఎంఎస్ 17లో ఆ రోజులకు సమానంగా సెలవు దినాల్లో పని చేయాలని షరతులు విధించడం సరికాదన్నారు. సంక్రాంతి సెలవు దినాల్లో కూడా కార్మికులు రోజుకు 12 నుంచి 13 గంటల వరకు పని చేసి 16 రోజుల సమ్మె కారణంగా పోగుబడిన చెత్తాచెదారం వ్యర్థాలను తొలగించారన్నారు. మానవత్వంతో కార్మికులు ప్రజలకు సేవలందించారన్నారు. షరతులు లేకుండా సమ్మె కాల జీతాన్ని చెల్లించాలని కోరారు. కొత్తగా తీసుకున్న కార్మికులకు ఎన్ఎంఆర్, క్లాఫ్ట్ డ్రైవర్స్ సమ్మె కాల జీతాలు చెల్లించాలన్నారు. సమస్యలను ఈ నెల 20వ తేదీ లోపు పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు, ఆందోళనలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు టౌన్ అధ్యక్షులు సూర్యారావు, మున్సిపల్ అధ్యక్షులు బాలరాజు, వైస్ ప్రెసిడెంట్ జి.వెంకటేష్, కార్యదర్శి జి.లక్ష్మణరావు, కోశాధికారి వీర్రాజు, కార్యదర్శి డి.రాజు, సభ్యులు మంగ, లక్ష్మి, టి.మంగ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు



పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్, అధికారులు

ఓటర్లలో చైతన్యం కోసమే స్వీప్

45 రోజులపాటు ముమ్మరంగా కార్యక్రమాలు - కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో రాబోయే ఎన్నికల్లో అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచి ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా రానున్న 45 రోజులపాటు ముమ్మరంగా స్వీప్ చైతన్య కార్యక్రమాలను నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ప్రధాన ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో గురువారం 'సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్' (స్వీప్) కార్యకలాపాలు, స్వీప్-2024 జిల్లా కార్యాచరణ ప్రణాళిక అమలుపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వీప్ కార్యక్రమాలకు సంబంధించి రూపొందించిన యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియా మాధ్యమాలను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఓటర్లను చైతన్యపర్చేందుకు అవగాహనాపర్చే పలు వాల్‌పోస్టర్లను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ టర్నోవర్ ఇప్లిమెంటేషన్ ప్లాన్ రూపొందించుకుని దానిని క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 90 నుంచి 92 శాతం పోలింగ్ నమోదయ్యే విధంగా అన్ని ప్రయత్నాలూ చేస్తున్నామన్నారు. దీనికి పటిష్టమైన ప్రణాళికను రూపొందించిన స్వీప్ నోడల్ అధికారి, డిపిఒ తూతిక శ్రీనివాస్‌విశ్వనాథ్‌ను కలెక్టర్ అభినందించారు. గత ఎన్నికల్లో జిల్లా సగటు ఎన్నికల పోలింగ్ 86 శాతం నమోదైందని, ఏలూరు అర్బన్ ప్రాంతంలో 69.02 శాతం నమోదైందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఏలూరు అర్బన్‌తోపాటు నూజివీడు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, ప్రాంతాల్లో కూడా ఓటర్ టర్నవుట్ పెంపు లక్ష్యంగా అన్ని ప్రయత్నాలూ చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో గత ఎన్నికల్లో నమోదైన సగటు శాతాన్ని మూడు విభాగాలుగా విభజించుకుని ఆ దిశగా ఎక్కడైతే పోలింగ్ శాతం తక్కువగా నమోదైందో అందుకు గల కారణాలను విశ్లేషించాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన ఐదు రోజుల్లోపు సంబంధిత పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పరీక్షలకు ముందుగానే పాఠశాలలు, కళాశాలల్లో స్వీప్ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. స్వీప్ కార్యక్రమాల్లో కేంద్రప్రభుత్వ శాఖల అధికారులను కూడా భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల్లో వినియోగించే ఇవిఎంలపై ఎటువంటి సందేహాలకూ తావులేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇవిఎంల నిర్వహణపై వివిధ దశల్లో తనిఖీలతోపాటు పలుమార్లు ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు చేర్చబడతాయన్నారు. ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలో ఓటర్ టర్నవుట్ పెంచేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు మాట్లాడుతూ జిల్లాలో 30 రోజుల పాటు ఇవిఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ రాజకీయ పక్షాల ప్రతినిధుల సమక్షంలో బెల్ ఇంజనీర్లు తనిఖీ చేశారన్నారు. జిల్లాలో మార్చి 31 వరకు నిర్వహించే స్వీప్ కార్యక్రమ కార్యాచరణ వివరాలు డిపిఒ, స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాస్ విశ్వనాథ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డిఆర్ఒ డి.పుష్పమణి, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ అద్దయ్య, డిఇఒ అబ్రహాం, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

హైవే దాటుతుండగా..

ఆర్‌టిసి బస్సును బలంగా ఢీకొన్న లారీ

27 మందికి గాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్, బుట్టాయగూడెం

'మరో ఐదు, పది నిముషాల్లో గమ్యస్థానానికి వచ్చేస్తాం.. అనుకుంటూ ఎవరికి వారు తమ లగేజీలు సరిచూసుకుంటూ బస్సు దిగేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇంతలో బస్సు ఒక్కసారిగా తీవ్ర కుదుపులకు లోనై ఊయలా వలె అటుఇటూ ఊగిపోయింది. నిలబడిన వాళ్లు కూర్చున్నవారిపై పడిపోతే, సీట్లలో కూర్చున్నవారు పక్కనే ఉన్న రాడ్లకు గుద్దుకున్నారు. ఒక క్షణం ఏమైందో ఎవరికీ అర్థంకాని పరిస్థితి. మరుక్షణం గాయాల పాలైన వారి ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది'. ఇదీ గురువారం ఉదయం జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డును దాటుతున్న ఆర్‌టిసి బస్సును హైవేపై వెళ్తున్న సిమెంట్ లోడు లారీ బలంగా ఢీకొన్న ప్రాంతంలో పరిస్థితి. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

జంగారెడ్డిగూడెం డిపోనకు చెందిన బస్సు బుట్టాయగూడెం మండలంలోని దొరమామిడి గ్రామానికి ఫస్టు ట్రిప్‌గా వెళ్లి మళ్లీ జంగారెడ్డిగూడెం వస్తోంది. ఆ బస్సు అశ్వారావుపేట-రాజమండ్రి బైపాస్ రోడ్డును దాటుకుంటూ పట్టణ పరిధిలోకి వస్తుండగా జీలుగుమిల్లి వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న లారీ బలంగా బస్సు చివరి భాగాన్ని బలంగా ఢీకొంది. బస్సు ఒక్కసారిగా కుదుపునకు గురై అటూఇటూ ఊగిపోయింది. ఆర్‌టిసి బస్సు డ్రైవర్ కూడా బస్సును వెంటనే నియంత్రించడంతో బస్సు బోల్తా పడకుండా అలాగే నిలిచింది. ఒక రెండు, మూడు సెకన్ల ముందు బస్సును లారీ ఢీకొంటే కచ్చితంగా బస్సు బోల్తా పడి పెనుప్రమాదమే చోటుచేసుకునేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బస్సు ప్రమాదానికి గురైన సమయంలో 57 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ప్రమాదంలో 27 మందికి గాయాలయ్యాయి. ప్రమాదం జరగ్గానే స్థానికులు, హైవేపై వెళ్లేవారు స్పందించి ప్రయివేటు వాహనాల్లో వీరందరినీ జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో తీవ్ర గాయాలైన జంగారెడ్డిగూడెం మండలం బొమ్మినవారిగూడెం నక్క ఆలివేలు (45), లక్కవరానికి చెందిన బోడే ప్రభాస్ (17), బుట్టాయటూడెం మండలం ముప్పినవారిగూడేనికి పి.పవన్‌కుమార్(12), కొల్లాయిగూడేనికి చెందిన పరసా రామసీత (35), బుట్టాయగూడేనికి చెందిన మోత్రపు సందీప్ (31)లను మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగిలిన 22 మంది జంగారెడ్డిగూడెం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రులను పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు, టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసులు, జనసేన పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు, జెడ్‌పిటిసి పోల్నాటి బాబ్జీ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జెట్టి గురునాధరావు పరామర్శించారు. సిఐ రాజేష్ ఆధ్వర్యాన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు చివరి భాగం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

బావిలో పడి యువకుడు మృతి

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

వారి నుంచి తప్పించుకునేందుకు పరిగెడుతుండగా ప్రమాదం

ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాశక్తి - చింతలపూడి

కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడి చేయడంతో అక్కడినుంచి పరిగెత్తుతూ ప్రమాదవశాత్తూ బావిలో పడి యువకుడు మృతి చెందాడు. లింగపాలెం మండలం గోకవరంలో చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపూడి మండలం బాలవారిగూడెం గ్రామానికి చెందిన రవి(23) మంగళవారం రాత్రి లింగపాలెం మండలం గోకవరం గ్రామంలో కోడిపందేలకు వెళ్లాడు. అక్కడ కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. దీంతో రవి అక్కడి నుంచి తప్పించుకునేందుకు పరిగెత్తుతూ ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. రెండు రోజుల నుంచి రవి కోసం కుటుంబ సభ్యులు వెతుకుతూనే ఉన్నారు. ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో మంగళవారం గోకవరంలో కోడిపందేలకు వెళ్లినట్లు తెలుసుకుని పరిసర ప్రాంతాల్లో వెతికారు. బావిలో రవి మృతదేహాన్ని గుర్తించారు. విషయం తెలుసుకున్న చింతలపూడి సిఐ సుధాకర్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పైకి తీయించారు. దీనిపై చింతపూడి సిఐ సుధాకర్‌ని వివరణ కోరగా యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడని చెప్పారు. రవి మొదటిసారిగా కోడిపందేలుగా వెళ్లినట్లుగా తెలుస్తుందని చెప్పారు. రవి మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

రవి మృతదేహం

విద్యతోనే ఉన్నత లక్ష్యాలు సాధ్యం

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనాని ప్రారంభించిన ఎంఎల్‌ఎ ఆళ్ల నాని



కళాశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఆళ్ల నాని, దూలం నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కలిదిండి

విద్యతోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించుకోగలరని ఏలూరు ఎంఎల్‌ఎ ఆళ్ల నాని అన్నారు. కలిదిండిలో రూ.8 కోట్ల నిధులతో నిర్మించిన వైఎస్ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనాన్ని కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణతో కలిసి గురువారం ప్రారంభించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు అత్యున్నత శిఖరాలను అధిరోహించేందుకు నూతన పాలిటెక్నిక్ కళాశాల ఎంతగానో తోడ్పడుతుందని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు బొర్రా సత్యవతి, సర్పంచులు మసిముక్కు మారుతీప్రసన్న వెంకటేశ్వరరావు, సానా మీనా సరస్వతి రామారావు, బత్తిన ఉమామహేశ్వరరావు, మహాదేవ విజయబాబు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, ఎంపిటిసి సభ్యులు నీలి సుమన్, సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షులు వడుపు రామారావు, పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

ఉపాధ్యాయుల పోస్ట్‌కార్డు ఉద్యమం

ప్రజాశక్తి - ఉంగుటూరు

సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలంటూ యుటిఎఫ్ ఉంగుటూరు మండల శాఖ ఉపాధ్యాయులు పోస్టు కార్డుల ఉద్యమాన్ని శుక్రవారం చేపట్టారు. సిఎం జగన్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీ నేతలకు పోస్టు కార్డులను రాశారు. ఒపిఎస్‌ను ఎన్నికల వాగ్దానంలో పెట్టేలా కృషి చేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పోస్టు కార్డుల ద్వారా కోరినట్లు యుటిఎఫ్ నాయకులు తెలిపారు. యుటిఎఫ్ మండలాధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, జోగినాయుడు, ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు.



పోస్ట్‌కార్డులు పంపుతున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని వీరిశెట్టిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామసచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎంపీ కోటగిరి శ్రీధర్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంటు సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్, చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభంపాటి విజయరాజు, చింతలపూడి మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ అశోక్, కామవరపుకోట జెడ్‌పిటిసి సభ్యులు కడిమి రమేష్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రభుత్వ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్

తహశీల్దార్ సుభానికి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

మండవల్లి తహశీల్దార్‌గా సుభాని

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లి తహశీల్దార్‌గా ఎఎస్.సుభాని ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం నిర్వహించిన బదిలీలో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న సుభానికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ మండవల్లి తహశీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు మండవల్లి తహశీల్దార్‌గా పని చేసిన రాజ్‌కుమార్ కాకినాడ జిల్లా ఉప్పాడ కొత్తపల్లి మండలం బదిలీ అయ్యారు. సుభానికి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ పరమైన సేవలను సత్వరమే అందించేలా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక కోట కలిదిండిలో రూ.35 లక్షలు, మిలటరీ పేటలో రూ.29.74 లక్షల గ్రామ పంచాయితీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, సర్పంచి మసిముక్కు మారుతీ ప్రసన్న వెంకటేశ్వరరావు, ఎఎంసి చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు నీలి సుమన్, మండల సర్పంచులు ఫోరం అధ్యక్షులు గద్దె ఆనంద్‌కుమార్, పంచాయతీ పాలక సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

స్థలం పరిశీలిస్తున్న కుమార్

భవన నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పై అంతస్తులో మెడికల్ నిధులతో కొవిడ్ ఎమర్జెన్సి చికిత్స (ఇసిఆర్‌పి)కు 12 పడకల భవన నిర్మాణానికి పనులు ప్రారంభించనున్నట్లు ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఇఇ) కెవిఎస్ఎన్.కుమార్ తెలిపారు. భవన నిర్మాణ పనులకు సంబంధించి పిహెచ్‌సి భవనం పై అంతస్తు స్థలాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ భవన నిర్మాణానికి రూ.19.64 లక్షల నిధులను వెచ్చించి త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక బాలికల ఆశ్రమ గిరిజన పాఠశాలను సందర్శించి అక్కడ వసతులను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న సదుపాయాల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డిఇ శ్రీనివాస్, సిబ్బంది హేమంత్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ట్రాఫిక్ వారోత్సవాల సందర్భంగా ఆటో యూనియన్‌లో ఉన్న డ్రైవర్లకు సిఐ రాజేష్, ట్రాఫిక్ ఎస్ఐ రంగయ్య పోలీస్‌స్టేషన్‌లో గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు సర్వీస్ చేసే ఆటోలకు ట్రాఫిక్ నిబంధనల ప్రకారం సీరియల్ నెంబర్ స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా సిఐ రాజేష్, ట్రాఫిక్ ఎస్ఐ రంగయ్య మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపేవారందరూ హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. కార్లలో వెళ్లే సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లు కచ్చితంగా యూనిఫాం ధరించాలని సూచించారు. వేగం నియంత్రణలు చూసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆర్‌టిసి బస్సు, వ్యాన్ ఢీ కొని నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఆర్‌టిసి బస్సు, వ్యాన్ ఢీ కొన్న ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌తో పాటు బస్సులో ఉన్న ముగ్గురు గాయాలపాలయ్యారు. ఈ ఘటన స్థానిక జగదాంబ సెంటర్ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జంగారెడ్డిగూడెం నుంచి అశ్వారావుపేట వైపు వెళు న్న ఆర్‌టిసి బస్సు, తెలంగాణ నుంచి జీలుగుమిల్లి వైపు వెళ్తున్న వ్యాన్ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌తో పాటు ఆర్‌టిసి బస్సులోని ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్సనిమిత్తం జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించారు. డ్రైవర్ రమేష్‌కు దవడ దగ్గర గాయం కావడంతో 108 అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదంలో ధ్వంసమైన వ్యాన్ ముందుభాగం

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని కొర్లకుంట శివారు సింహాద్రిపురంలో అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద తొమ్మిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వాసు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా మద్యం విక్రయించినవారిపై కఠిన తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుదాఘాతానికి గురైన యువకుడు మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యుదాఘాతానికి గురైన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కామవరపుకోట మండలం వీరభద్రకాలనీకి చెందిన బుంగా రవి కుమారుడు సాయి (21) ఇంటర్ వరకు చదివాడు. ప్రస్తుతం అతను కరెంటు పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల ఏడో తేదీన మండలంలోని మక్కినవారిగూడెంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద కరెంట్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతడిని బంధువులు విజయవాడ ఆంధ్రా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈ నెల 14వ తేదీ మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నేటి బంద్, సమ్మె జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - పెదపాడు

ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్న గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని కొత్తూరులో గురువారం ఎడ్లబండి, ట్రాక్టర్‌తో గురువారం ప్రదర్శన నిర్వహించారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని, రైతులకు రుణమాఫీ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఢిల్లీలో రైతులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం పెద్దఎత్తున ఉద్యమిస్తుంటే మోడీ ప్రభుత్వం వారిపై యుద్ధం ప్రకటించడం అన్యాయమన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పల్లపోతు రెడ్డియ్య, ముత్యాల రామకృష్ణ, కడిమి రాజు, ఆవాల రాము, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : స్థానికంగా గురువారం నిర్వహించిన ఆటో డ్రైవర్ గ్రూప్ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శుక్ల బోయిన రాంబాబు మాట్లాడారు. ప్రమాదాలకు అసలు కారణాలను పరిశీలించి సమస్యను పరిష్కరించి ప్రజల్లో రహదారి భద్రత నియమాల పట్ల అవగాహన కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. అందుకు చైతన్యవంతమైన ప్రజలే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని, ఆటో, లారీ, టాక్సీ డ్రైవర్లందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జయరాజు, సత్యనారాయణ, షేక్ అమీర్ బాషా, కె.జాన్, చింతా పవన్, చొక్కా వెంకటేష్, చాపల రాంబాబు, వేమన వెంకటేష్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకరరావు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్షులు పి.సూర్యరావు, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు కెవి.రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగిస్తుందన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్, అటవీ సంపదలను, రవాణా బ్యాంకులు, ఎల్ఐసి తదితర సంస్థలన్నిటిని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించాలని చూస్తుందన్నారు. కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక కోడ్‌లుగా తెచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కోరుతూ 16న జరిగే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. 16న బుట్టాయగూడెం రోడ్డులో ఉన్న పాత పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి స్థానిక బస్టాండ్ వరకు ప్రదర్శన ర్యాలీ సభ ఉంటుందని, అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపాలిటి కార్మికుడు లక్ష్మణరావు, ట్రాలీ ఆటోయూనియన్ బి.నాని, పి.సత్తిబాబు, కె.ఆనందరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : మాట్లాడుతున్న నాయకులు

రైతాంగంపై దాడిని ఖండించాలి : సిపిఎం

ప్రజాశక్తి - నిడమర్రు

తమ సమస్యలు పరిష్కరించాలని ఢిల్లీలో శాంతియుతంగా పోరాటం చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం దాడిని ఖండించాలని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణరావు అన్నారు. మండలంలోని భువనపల్లిలో గవర సత్యనారాయణ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సిపిఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాల రద్దు, పంటకు గిట్టుబాటు ధర వాగ్దానాలు అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. ఆ వాగ్దానాలు అమలు చేయాలని ఢిల్లీలో శాంతియుతంగా పోరాటం చేస్తున్న రైతులపై దాడి చేస్తున్నారు. శాంతియుతంగా చర్చలు జరిపి వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కంచ వరప్రసాద్, లావేటి చంద్రరావు, వెలగలేటి మోహన, కానూరు రాజు పాల్గొన్నారు.

వికలాంగుల ఆశ్రమానికి విద్యార్థుల సాయం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని సూరంపాలెం మండల ప్రజా పరిషత్ పాఠశాల విద్యార్థులు వికలాంగుల ఆశ్రమానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందించారు. పెదపాడు గ్రామంలోని వికలాంగుల ఆశ్రమ వ్యవస్థాపకులు క్రీస్తు ప్రకాష్‌కు విద్యార్థులు రూ.12 వేలు గురువారం అందించారు. ఈ సందర్భంగా వికలాంగుల ఆశ్రమ వ్యవస్థాపకులు క్రీస్తు ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనంలోనే వికలాంగులకు ఆర్థిక సహాయాన్ని అందించాలనే ఆలోచన హర్షణీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎన్నో చేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోతవరపు ముత్తయ్య, ఉపాధ్యాయురాలు సిహెచ్.అనిత పాల్గొన్నారు.

చింతలవల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ముసునూరు

ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యులు భవాని అన్నారు. మండలంలోని చింతలవల్లిలో రాష్ట్ర, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థల వారి సహకారంతో చెయ్ డిఫాండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ వారి ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ముసునూరు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షకీలా ఇవాంజెలిన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రతి ఆరు నెలలకోసారి హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో చెయ్ డిఫాండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం జోనల్ సూపర్‌వైజర్ సుందరరావు, ఎంఎల్‌హెచ్‌పి సుమలత, ఎఎన్ఎం భాగ్యలక్ష్మి, లింక్ వర్కర్లు రమేష్, రాధిక, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వడాలి జెడ్‌పిహెచ్ స్కూల్ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఆడి పాడారు. ఆటలు, పాటల పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ వెంకటేశ్వరరావు, సర్పంచి మరీదు దుర్గాశ్రీ హనుమంతు, ఎంపిటిసి సభ్యులు పల్లి శ్రీదేవి, హెచ్ఎం ప్రభుదాసు, విద్యా కమిటీ చైర్మన్ పల్లి ఉమామహేశ్వరి, మద్రివాడ వీరారెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

'కార్యకర్తలకు అండగా టిడిపి'

చింతలపూడి :ఆపదలో ఉన్న టిడిపి కార్యకర్తలను పార్టీ ఆదుకుంటుందని, అండగా ఉంటుందని ఆ ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ యువ నాయకులు సొంగా రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలం తోచిలకరాయుడుపాలెం గ్రామానికి చెందిన పింగుల కుటుంబరావు కిడ్నీ సమస్యతో ఏలూరులోని సిరి హాస్పిటల్‌లో చేరారు. విషయాన్ని గ్రామ నాయకులు రాంబాబుతో పాటు మరికొంతమంది సొంగా రోషన్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ కార్యకర్తల పట్ల ఎంతో ఆదరణ చూపిస్తారని, వారి అడుగుజాడల్లో తాను కూడా తన కార్యకర్తలను అన్ని వేళలా కాపాడుకుంటనని చెప్పారు.

గృహ నిర్బంధం దారుణం

ఏలూరు టౌన్ :రాష్ట్ర ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని, అలా కాకుండా నిరసన తెలపకుండా నాయకులను గృహ నిర్బంధం చేయటం సిగ్గుచేటని అగ్రిగోల్డ్ ఏజెంట్స్, కస్టమర్స్ అసోసియేషన్ నాయకులు బండి వెంకటేశ్వరరావు అన్నారు. సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ 15న విజయవాడలో నిరసన కార్యక్రమానికి సిపిఐ అనుబంధ అగ్రిగోల్డ్ ఏజెంట్స్, కస్టమర్స్ అసోసియేషన్ నిరసన కార్యక్రమానికి పిలుపు ఇచ్చిందన్నారు. జిల్లా నుంచి నుంచి నాయకులు, అగ్రిగోల్డ్ బాధితులు విజయవాడ వెళ్లకుండా పోలీసులు నోటీసులు ఇచ్చి గృహ నిర్బంధాలు చేయడం దారుణమన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మార్చి తొమ్మిదో తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్‌కుమారితో కలిసి ఆయన గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్, సివిల్, వాహన ప్రమాద బీమా కేసులు, ఆర్బిట్రేషన్ ఓపీలు, చిట్ ఫండ్ కేసులు, బ్యాంకు లావాదేవీలు, కుటుంబ తగాదాలు రాజీ చేయనున్నట్లు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ఏడు వేల కేసులు రాజీయోగ్యమైనవిగా గుర్తించినట్లు చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని కేసుల నుంచి విముక్తి పొందాలని సూచించారు. లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ప్రతిరోజు రాజీయోగ్యమైన కేసుల్లో ప్రీ సిట్టింగ్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజీ పడదలుచుకున్న కక్షిదారులు నేరుగా, న్యాయవాది ద్వారా కేసుల వివరాలను సంబంధిత కోర్టులకు, పర్మినెంట్ లోక్ అదాలత్‌లో సంప్రదించాలని తెలిపారు.

నేడు రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ఏలూరు టౌన్ :గాలాయగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాన్ని ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి శుక్రవారం ప్రారంభిస్తారని ఎంపిడిఒ వి.శ్రీలత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఘనంగా గెలీలియో జయంతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని నారాయణపురం ఉషోదయ పబ్లిక్ స్కూల్లో గెలీలియో జయంతి సందర్భంగా మహనీయుల ఆశయాల ప్రచార కమిటీ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మహనీయుల ఆశయ ప్రచార కమిటీ మండలాధ్యక్షులు డాక్టర్ కొండ రవి మాట్లాడుతూ సమాజాభివృద్ధికి కృషి చేసిన మహనీయులు, శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మూఢ నమ్మకాలను విడిచిపెట్టి విజ్ఞాన సముపార్జన చేసి సమాజాన్ని చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందన్నారు. ఆధునిక భౌతిక, గణిత, తత్వశాస్త్రాలలో ప్రావీణ్యం సంపాదించిన మేధావి, టెలిస్కోప్‌ను కనుగొని సూర్యుని చుట్టూ భూమి తిరుగుతుందని, భూమి గుండ్రంగా ఉందని నిరూపించిన గెలీలియోకు ఆనాటి సమాజం తిరస్కరించి మరణశిక్ష విధించిందన్నారు. ఏలూరు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు మాట్లాడుతూ మన ప్రాంతంలోనే జన్మించి స్వాతంత్రోద్యమంలో పాల్గొని దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయులు అల్లూరి సీతారామరాజు శత జయంతి సందర్భంగా వారి జీవితంలోని కొన్ని ముఖ్య ఘట్టాలను వివరించారు. త్యాగ మూర్తుల గొప్పతనాన్ని తెలియజేసే పుస్తకాన్ని, క్యాలెండర్‌ను ఉషోదయ హైస్కూల్ ఉపాధ్యాయులకు అందించారు. గెలీలియోకు నివాళి అర్పించారు. మహనీయుల ఆశయాల ప్రచార కమిటీ ఉంగుటూరు మండల సభ్యులు కొర్ని అప్పారావు, ఎస్.అప్పారావు, ఉషోదయ హై స్కూల్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పుస్తకం, క్యాలెండర్ అందిస్తున్న వక్తలు

ప్రభుత్వాసుపత్రి సిబ్బందికి పెరిగిన పని భారం

ఆదివాసీ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జోగారావు

ప్రజాశక్తి - కుక్కునూరు

మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో పని ఒత్తిడి బాగా ఉందని ఆదివాసీ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు టి.జోగారావు అన్నారు. మండలంలోని కొడపల్లిలో ఆదివాసీ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సమావేశం జిల్లా నాయకుడు సున్నం శ్రీరాములుదొర ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగారావు ఉన్నతాధికారులు ఎక్కువైపోయాయ్యారు. టార్గెట్స్ అంటూ పని భారం పెంచేస్తున్నారని, టార్గెట్స్ చేయలేకపోతే మెమో, షోకాజ్ నోటీసులు అంటూ బెదిరిస్తున్నారని చెప్పారు. పిహెచ్‌సిలో ముగ్గురు మాత్రమే స్టాఫ్ నర్సస్ ఉండాలని చెప్పారన్నారు. ఏదైనా అవసరం నిమిత్తం ఒక స్టాఫ్ నర్స్ సెలవు పెడితే మిగిలిన ఇద్దరు సిబ్బంది 24 గంటలు పని చేయాల్సి వస్తుందన్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో నలుగురు స్టాఫ్ నర్సులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐటిడిఎ పరిధిలో పిహెచ్‌సిలలో ఖాళీగా ఉన్న వాటికి నోటిఫికేషన్ ఇచ్చి జిఒ ఎంఎస్ 68 ప్రకారంగా ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఎఎన్ఎంలు యాప్ ఆన్‌లైన్ పేరుతో అధిక పని భారం పెరిగి మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారన్నారు. సిబ్బందికి జీతాలు, లీవ్స్ ఇచ్చే విషయంలో కొంత మంది డాక్టర్స్ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక ఉద్యోగి ఎలా సక్రమంగా తన పనిని నిర్వహిస్తారన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉద్యోగుల నుంచి తిరుగుబాటు మొదలవుతుందన్నారు. ఉన్నతాధికారుల వేధింపులు ఆపకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారులు ఎస్.నాగేశ్వరరావు, కె.రాజారావు, ఎస్.బుచ్చయ్య, వెంకటలక్ష్మి, మాధవి, వేణు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో దళితులపై పెరిగిన దాడులు

మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ఆయనతో మహాసేన రాజేష్ మర్యాదపూర్వక భేటీ

ప్రజాశక్తి - పెదవేగి

రాష్ట్రంలోని అన్ని తరగతులను దగా చేసి గద్దెనెక్కిన జగన్ పాలనలో దళితులపై దాడులు మరింతగా పెరిగిపోయాయని, దళితులకు జగన్ తీవ్ర అన్యాయం చేశారని మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. మండలంలోని దుగ్గిరాలలో టిడిపి దెందులూరు నియోజకవర్గ కార్యాలయంలో చింతమనేని ప్రభాకర్‌తో మహాసేన రాజేష్ గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. వైసిపి పాలనలో రాష్ట్రంలో జరుగుతున్న దళితులపై దాడులు, అన్యాయలు సహా పలు అంశాలపై చర్చించారు. ఈ నెల 18వ తేదీన నిడదవోలు అంబేద్కర్ మల్టీ పర్పస్ భవనంలో మహాసేన రాజేష్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో జరగనున్న దగా పడ్డ దళితుడా..రా..కదలిరా.. కార్యక్రమాన్ని విజయవంతం చేయటంలో ముఖ్య భూమిక పోషించాలని చింతమనేని ప్రభాకర్‌ని కోరారు. ఈ సందర్భంగా చింత మనేని ప్రభాకర్ మాట్లాడుతూ అన్ని తరగతులతో పాటు దళితులను సైతం దగా చేసి గద్దెనెక్కిన జగన్, తిరిగి వారిపైనే దాడులు చేయిస్తున్నారన్నారు. జగన్ నియంత పాలనకు చరమ గీతం పాడటానికి దళిత సోదరులు అంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, ఎస్‌సి సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

FEDERAL BANK
YOUR PERFECT BANKING PARTNER
గోల్డ్ అప్రైజర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం
ఏలూరు నగరంలోని ఆర్.ఆర్.పేటలో ఉన్న ఫెడరల్ బ్యాంక్ శాఖలో గోల్డ్ అప్రైజర్ నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దరఖాస్తుదారులు నగరానికి చెందినవారై ఉండాలి. విశ్వబ్రాహ్మణ అయి ఉండాలి. బంగారు ఆభరణాల తయారీ, అప్రైజింగ్‌లో కనీసం 2 సం॥రాలు అనుభవం ఉండాలి. కనీస విద్యార్హత 10వ తరగతి ఉత్తీర్ణత ఉండాలి. ఈ అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈనెల 17-2-2024 లోగా బ్యాంక్ శాఖ అధికారులను సంప్రదించాలని బ్యాంకు అధికారులు తెలిపారు.
సం/- బ్యాంక్ మేనేజర్
ఫెడరల్ బ్యాంక్, ఏలూరు బ్రాంచి

'సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి'

ప్రజాశక్తి - టి.నరసాపురం

లంబాడీల ఆరాధ్య దైవంగా భావించే సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని బంజారా బజరంగీ బేరి కమిటీ సభ్యులు భూక్యా వేణుగోపాల్ నాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని కృష్ణాపురంలో లంబాడీల సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలు బంజారా బజరంగీ బేరి కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వృద్ధులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భూక్యా భిగనాధం, తేజావత్ బాలాజీ, జరబల చిన్ని, భూక్యా దుర్గారావు పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో...

బుట్టాయగూడెం : గిరిజన లంబాడీల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకను మండలంలోని కోయ రాజమండ్రిలో ఎస్‌టి బంజారా సుగాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా సేవాలాల్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. సేవాలాల్ మహారాజ్ నూతన భవనాన్ని సుగాలి సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు భూక్యా నాగేశ్వరనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించి ప్రతి ఏటా ఫిబ్రవరి 15వ తేదీన తాము జరిపే సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాన్ని అధికారికంగా జరిపి సెలవు దినం ప్రకటించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ధారావతు కిమ్యానాయక్, గుగులోతు మోహన్‌రావు నాయక్, బాణావతు కృష్ణనాయక్, బి.రాంబాబునాయక్, బి.సురేష్ నాయక్ బాణావతు చంద్రనాయక్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.6.60 లక్షలు

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక శ్రీ పాతాళ భోగేశ్వర స్వామి ఆలయ వార్షిక హుండీ ఆదాయన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారులు, ఆలయ ధర్మ కర్తల మండలి సమక్షంలో గురువారం లెక్కించారు. రూ.6,60,066 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

CHANGE OF NAME

I, THOTA PARVATHI PADMA KUSUMA, W/o. MOHAN MURALI VENKATA BRAHMAJI, R/o. H.No. 5-3-56, Near Mekala Kamela, Mentevari Thota, Bhimavaram, Bhimavaram Mandal, W.G.Dt (A.P) - 534201. I have changed my name from **TOTA KUSUMA** (Old Name) to **THOTA PARVATHI PADMA KUSUMA** (New Name). Henceforth all my documents and correspondence will be continued with my New Name **THOTA PARVATHI PADMA KUSUMA.**

పాస్‌పోర్టు పోయినది

కర్రి కృష్ణారెడ్డి, తండ్రి: కర్రి వెంకటరెడ్డి అను నేను నా యొక్క పాస్‌పోర్టు పోయినది. ఎస్.ఇల్లింద్రపర్రు నుండి పెనుమంట్ర వెళ్ళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెం. **S2634769** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్: కర్రి కృష్ణారెడ్డి
తండ్రి: కర్రి వెంకటరెడ్డి
ఎస్.ఇల్లింద్రపర్రు, పెనుమంట్ర మండలం
పశ్చిమగోదావరి జిల్లా - 534225
సెల్: 9848093331

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. No. 3/2023 in O.S. No. 57/2022
Between:
కర్రి శ్రీనివాసరావు ...DHR
మరియు
అన్నెపు రాజు ...JDR/ ప్రతివాది

పై నెంబరు E.P. పిటిషన్ నందు JDR మొక్క హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ద్వారా అనేక పర్యాయములు నోటీసులు పంపించినప్పటికి ఇప్పటివరకు నోటీసులు తీసుకొనకుండా కోర్టు వారి ఎదుట హాజరు కాని కారణంగా శ్రీ కోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీసు రూపంలో నోటీసు అమలు చేయమని ఆర్డరు వేసి ఉన్నందున ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియచేయునది ఏమనగా, మీ యొక్క హాజరు నిమిత్తం పై నెంబరు E.P. పిటిషన్ నందు శ్రీ కోర్టు వాయిదా **ది. 19-2-2024వ తేదీన వేసియున్నందున ఆరోజు ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు వారు ఎదుట హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

మాకా సత్యనారాయణ, అడ్వకేట్
తాడేపల్లిగూడెం, సెల్: 9949890672

గ్రామపంచాయతీ కార్యాలయం, పుట్లచెరువు
మండవల్లి మండలం, ఏలూరు జిల్లా
టెండరు ప్రకటన
తేది.15-02-2024

ఏలూరు జిల్లా, మండవల్లి మండలం, పుట్ల చెరువు గ్రామపంచాయతి నందు R.O. ప్లాంట్ నిర్వహణకు ఆసక్తి/ సేవాదృక్పథము గల వారి నుండి టెండర్లు కోరుట.

వ.నెం.	పని వివరము	ధరావత్తు
1	ఆర్.ఒ. ప్లాంట్ నిర్వహణ	రూ. 2000/-

పై పేర్కొనబడిన పనిని నిర్వహించుటకు మరిన్ని వివరములు కొరకు దిగువ తెలియపరచిన గ్రామపంచాయతీ వారిని కార్యాలయ పని వేళలలో సంప్రదించగలరు.

నోట్: చెల్లించిన ధరావత్తులు తిరిగి చెల్లించబడవు మరియు టెండర్ల రేట్ల మార్చుటకు గాని, టెండర్ల ప్రక్రియ నిలిపివేయుటకు గాని గ్రామపంచాయతికి అధికారము కలదు.

తేది: 19-02-2024, ఉదయం 11.00 గం॥లకు టెండర్లు స్వీకరించబడును. అదేరోజు మ॥ 12 గం॥లకు టెండర్లు తెరవబడును.

సం/- ఎస్.వి.రాధిక
కార్యదర్శి, గ్రామపంచాయితీ, పుట్లచెరువు
మండవల్లి మండలం

సం/- జి.వెంకటేశ్వరరావు
సర్పంచ్, గ్రామపంచాయితీ
పుట్ల చెరువు, మండవల్లి మండలం